"ఇందులో తప్పేముంది? మొదటి పెళ్ళాం మంచం పట్టేసుంటుంది. ఇంకో పెళ్లి చేసుకోమని పర్మిషన్ ఇచ్చిందేమో?" అన్నాను.

"అరవై లక్షల ఆస్తీ స్వంత వ్యాపారం ఉన్నవాడికి ఉద్యోగస్తురాలైన భార్య ఎందుకూ-అని శంకర్రావు సందేహం. వాళ్ల అన్నయ్య కూతురికి ఈ వూళ్లో ఉద్యోగంకనక (వాళ్ళదీ ఆ కులమే కనక) ఈ సందేహం తీర్చుకుందికి వచ్చేడన్నమాట" అన్నాడు జగ్గారావు.

"యామైంది, చివరికి? సందేహం తీరిందా? కథ సుఖాంతమేనా?"

"అదే చెప్తున్నాను. శంకర్రావు పరిశోధన ఫలించింది. అసలే అతగాడు వ్యాపారపు పనుల్లో తీరుబాటులేక ఫ్యాక్టరీ, ఆఫీసూ చూసుకుని రాత్రి ఏ ఎనిమిది గంటలకో వస్తాట్ట. పగలంతా ఈ సవితులిద్దరూ కొట్టుకుంటూనో తిట్టుకుంటూనో గడపకుండా చిన్నావిడ ఏదో ఉద్యోగానికి పోతే న్యూసెన్సు ఉండదనిట- ఆ ప్రకటన వేసిన అతని ఉద్దేశం! అంతేగాని పెళ్ళాం కూడా వేణ్ణీళ్ళకి చన్నీళ్ళుగా నెలకో వెయ్యి రూపాయలు సంపాదించాలని కాదుట. అలా రూఢి చేసుకొని ఆ సంబంధం ఖాయపరిచేడు మన ప్రకటనా ప్రియుడు!" ★

# 116. స్పీక్, బ్రింగ్, డిస్కస్

వీరభద్రం గారని, మాకో ఆఫీసర్‌గారు ఉండేవారు. ఆయన సరాసరి నియామకం మీద మా డిపార్ట్‌మెంట్‌లో ఆఫీసర్‌గా చేరేరు. ఉద్యోగానికి నియామకం పొందిన నాటికే పెద్ద జీతగాడు కావడం వల్ల ప్రభుత్వం ఏర్పరచిన రూలు ప్రకారం రెండు నెలల నామమాత్రపు ట్రైనింగ్ పూర్తవగానే అతన్ని మా యూనిట్‌కి ఆఫీసర్‌గా పోస్టు చేసేరు. ట్రెయినింగులో "శాస్త్ర ప్రకారం" చెప్పవలసినవేవో చెప్పినా, యూనిట్ ఇన్‌ఛార్జిగా చేరేక తటస్థించే సమస్యలను గురించీ, వాటి పరిష్కారాలను గురించీ చెప్పరు కదా. అంచేత వీరభద్రం గారు తరచుగా నిర్ణయ సంబంధమైన చిక్కుల్లో పడేవారు.

ఒకసారి ఆయన ఒక గ్రామానికి తనిఖీకి వెళ్లి, సర్వే నెంబర్ల ప్లాను చేత్తో పుచ్చుకుని పొలాల్లో తిరుగుతూ ఉండగా ఒక తమాషా జరిగింది. ప్లాను ప్రకారం తను తిరుగుతున్న పొలం గట్లు ఫలానా అని గుర్తించడానికి తను ఎక్కడున్నాడో ఆ స్థలానికి ప్లాన్‌లో ఉన్న గీత మీద ఒక వేలు ఉంచుకుని పని కానిస్తూ ఉన్నాడన్న మాట. ఉన్నట్టుండి ఆయన ముక్కుమీద ఒక ఈగ వాలింది. మొహం ఇటూ అటూ జాడించినా ఈగ పోయింది కాదు. దాంతో ప్లాను మీద ఉన్న వేలితో ఈగను తరిమాడు. ఈగైతే పోయింది గాని ఆ ఈగని తరిమిన వేలు ప్లాన్‌లో ఎక్కణ్ణించి తీశాడో ఆయనకి గుర్తు రాలేదు. "అరె! వేలు తీసేశానే; ఎక్కడున్నాం మనం?" అని తనలో అనుకోవలసింది కాస్తా పైకి అనేశాడు. సర్వే అధికారికి అది చాలా అవమానకరమైన విషయం.

అయితే ఆయన అప్పట్నుంచి మరోరకం జాగ్రత్త పాటించి; తనకి ఏదో తెలియడం లేదన్న సంగతి ఇతరులకి తెలియకుండా జాగ్రత్త పడే టెక్నిక్ నేర్చాడు. "ఏమయ్యా, రంగనాయకులూ! గవర్నమెంట్ బంజరు భూముల్లో రాజకీయ బాధితులకి - లేదా యుద్ధ కారణంగా వికలాంగులైన వారికి - పట్టాలిమ్మని రికమెండ్ చేసేటప్పుడు పాటించవలసిన నియమ నిబంధనలు నీకు సరిగ్గా తెలుసా అసలు?" అని డబాయించి; ఎదురుగుండా ఉన్న ఫైల్‌ని ఎత్తికొట్టేవాడు. దాంతో ఆ రంగనాయకులు తను రూల్సన్నీ ఎలా తూచా తప్పకుండా పాటించేడో ఆ వివరం అంతా మనవి

చేసేవాడు. "సర్లే, వెళ్లు!" అని రంగనాయకుల్ని వదిలించుకుని; అదే సమస్యని వెంకటాద్రి దగ్గర ప్రస్తావించి రూలేమిటి, పద్ధతేమిటి - అని గ్రహించి ఆర్డర్స్ వేసేవాడు. అది కరెక్ట్‌గానే పడేది.

అలా మనుషుల్ని పిల్చి కిందా మీదా పెట్టడానికి కుదరనప్పుడు ఆ ఫైలు మీద "స్పీక్!" అని రాసేవాడు వీరభద్రంగారు. దాంతో ఆ ఫైలు నడిపిన ఉద్యోగి ఫైలుతో సహా వచ్చి, ఇతనేమీ అడక్కుండానే సబ్జెక్టేమిటి, రూలేమిటి మనం చేసింది సమంజసమే అని ఎలా భావించాలి - అన్నీ చెప్పేవాడు. "ఓకే, ఓకే!" అని వీరభద్రంగారు సంతకం పెట్టేసేవాడు.

ఇవి మొత్తం మూడు మాటలు : స్పీక్, బ్రింగ్, డిస్కస్. స్పీక్ అంటే మాట్లాడమనీ, బ్రింగ్ అంటే ఫైల్‌తో ఓసారి వచ్చి కనిపించమనీ, డిస్కస్ అంటే చర్చించమనీ కదా అర్థాలు. మూడూ ఇంచుమించు ఒకటే. ఈ ఫైల్లో నువ్వు రాసింది నిజమేనా? దీంట్లో ఏదో గొయ్యి లేదు కదా! ఈ ఆర్డర్ ఇలా వేసెయ్యొచ్చునా? రేపు పైనుంచి ఏదైనా గూటింపు వచ్చి మెడకి చుట్టుకుంటుందో యేమిటో! నువ్వు ఒకసారి వచ్చి మాట్లాడు. వచ్చేటప్పుడు ఈ ఫైలు నీకూడా తీసుకురా. దీంట్లో లోతుపాతులు మనం ఓసారి చర్చించాలి సుమా!- ఇన్ని మాటలు ఆ మూడు మాటల్లో నిబిడీకృతమై ఉన్నాయని గ్రహించాలి.

నారాయణమూర్తి గారి తంతు వేరుగా ఉండేది. ఆయన డైరెక్టు రిక్రూట్ కాదు. కిందనుంచి ప్రమోషన్లు పొంది ఆఫీసర్ హోదాకి చేరుకున్నవాడే. అంచేత రూల్సు, కోడ్సు, మాన్యువల్స్ - ఆయనకి కరతలామలకంగా, గళగ్రాహిగా ఉండేవే. కాని, ఆయన కూడా స్పీకూ బ్రింగూ రాసేవారు. అందులో ఇమిడి ఉన్న మర్మం ఏమిటంటేనూ -

"స్పీక్" అని రాసున్న ఫైలు పుచ్చుకుని ఆ ఫైలు గల గుమస్తా వెళతాడు కదా, అతగాడు తన ఛాంబర్స్‌లోకి రాగానే అక్కడున్న "ఇతరుల్ని" పంపించేసి - "అవునయ్యా, ఆర్డర్ పంపిస్తున్నాం సరే - ఆ చౌదరిగారు ఏం చేస్తున్నాడు? మళ్ళా కనబడలేదు. ఏమిటి అతనుద్దేశం?" అని ఆయనే చకచకా స్పీకేవాడు. దాంతో ఆ వచ్చిన ఉద్యోగి "యస్సార్, నేను కబురు పెట్టాను సార్!" అని చెప్పి ఇవతలికొచ్చేసి చౌదరి గారికే కాకుండా ఇతర ఫైళ్ళలో పాత్రులు, పాత్రలు అయిన రెడ్డిగారికి, రాజుగారికి, నాయుడు గారికి కబుర్లు పెట్టేసేవాడు.

నారాయణమూర్తిగారు "బ్రింగ్!" అనే మాట హెడ్ గుమాస్తా ప్రభాకరరావు ఫైల్స్‌లో మాత్రమే రాసేవారు. బ్రింగ్ అంటే "తీసుకురా" అనే అర్థం అందరికీ తెలిసిందే. కాని, ప్రభాకరరావు ఆ ఫైలు తీసుకెళ్లకుండానే వెళ్లేవాడు. ఆ శని-ఆదివారాలు అయ్యగారు ఎలా గడపాలనుకుంటున్నారో ఎక్కడ గడపాలనుకుంటున్నారో వారి ముఖతా విని, "తీసికెళ్లే" మనుషులెవరు, పదార్థాలేమిటి - అన్నీ గ్రహించి ఆ మనుషుల్నీ పదార్థాల్నీ, "అక్కడికే" తీసుకెళ్లేవాడు. సోమవారం నాడు ఫైలు మీద ఆర్డర్స్ పడిపోయేవి.

నరసయ్యగారని ఒక డిప్యూటీ కలెక్టర్ గారు ఉండేవారు. ఆయన్ని ఒక ప్రభుత్వ రంగ సంస్థకి "సెక్రటరీ"గా వేసేరు. "ఛైర్మన్"గా ఒక అనధికార ప్రజా నాయకుడు ఉండేవాడు. ఆయన ఒకసారి నరసయ్య గారు పంపిన ఫైలు మీద "స్పీక్" అని రాస్తే, ఈయన వెళ్లలేదు. కనీసం ఇంటర్‌కమ్ ఫోన్‌లో అయినా మాట్లాడలేదు.

"ఈ ఫైల్లో స్పీకడానికి ఏమీ లేదు. రాసిందంతా స్పష్టంగానూ కూలంకషంగానూ ఉంది.

చైర్మన్‌గారు శ్రద్ధగా చదివి తీరికగా ఆలోచించి తమకి తోచిన విధంగా ఆర్డరు వేయవచ్చును" అని రాసి పంపించేశాడు నరసయ్య గారు.

ఆ చైర్మను గారు ఆ రోజంతా ఊరుకుని మర్నాడు తానే స్వయంగా నరసయ్యగారి గదికి విచ్చేశారు. "మీతో నేను పూర్తిగా ఏకీభవిస్తున్నాను. అయితేనూ, ఈ స్పీక్-జబ్బు ఎలా ప్రారంభ మైందంటారు?" అన్నాడు.

"బ్రిటిషు వాళ్ళు రాజ్యం చేస్తున్నపుడు కావొచ్చండి. ఇండియన్ బురోక్రాట్లు రూల్సు అడ్డం పెట్టుకుని తమని ఏ గోతులో దింపుతున్నారో, తమ చేత ఏ తప్పుడు ఆర్డర్స్ వేయిస్తున్నారో అని అనుమానం పడి, రాసిన వాణ్ణి పిలిచి దబాయించి, బెదిరించి, తమకు కావలసిన విధంగా ఫైలు తిరిగి రాయించుకోవడానికి ఈ సాధనం వాడేవారని అనుకుంటానండి. ఇప్పుడు అధికార్లే కాకుండా సూపరింట్లు, ఆఖరికి హెడ్ గుమాస్తాలు సైతం గుమాస్తాలు రాసిన అయిదారు పేజీల నోట్ చదివే వోపికలేక ఆ రాసిందేదో మూడు ముక్కల్లోనో మూడు నిముషాల్లోనో బోధపరుస్తారని స్పీకులు రాసేస్తున్నారండి. మనలో ఉన్న కృషి లోపానికీ, ఆలోచనా దారిద్ర్యానికీ ఇది ఒక నిదర్శనం అనుకుంటానండి" అని నరసయ్య గారు చెప్పారు.

చైర్మను గారు నరసయ్యగారికి షేక్ హేండ్ ఇచ్చి వెంటనే తమ ఛాంబర్స్‌లోకి వెళ్లి ముఖ్యమంత్రి గారితో ఎస్.టి.డి. (ఫోన్)లో మాట్లాడి "ఈ నరసయ్య గారిక్కడ ఉంటే మన పన్లు జరగవు సార్" అని చెప్పేరు. నాలుగు రోజుల్లో నరసయ్య గారికి ఒక "పనికిరాని" ఆఫీసుకి ట్రాన్స్‌ఫర్ ఆర్డర్స్ వచ్చేశాయి.

కథ 'సఖాంతం.'

★